# మరనాథ మెసేంజర్

క్రైస్తవ ఆధ్యాత్మిక మాసపత్రిక

# MARANATHA MESSENGER




సంపుటి 37 మే 2019 సంచిక 5

# ఈ సంచికలో


1. లూకా సువార్త - 35 - శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి
2. క్రైస్తవ / బైబిలు వేద విద్యా సంస్థలు - గుర్తింపు ఆవశ్యకత - డా॥ నిరీక్షణ కె. కంచర్ల
3. ఏం అనుకుంటున్నారు? - సహోదరి ఎ. ఉషారాణి
4. ఎఫెసీ పత్రిక - 9 - రెవ. అల్లూరి విశ్వప్రసాద్
5. అమ్మతనానికే... అమ్మ - డా॥ మనష్షే కొటారి



ప్రధాన సంపాదకులు : శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి

సంపాదక వర్గం :

రెవ. సైలస్ ప్రకాష్, రెవ.డా॥ నిరీక్షణ కంచర్ల, రెవ. జి.యం.రాజు, రెవ.జి.యేసుదాసు



మీ చందాలు, వ్యాసములు ఈ క్రింది చిరునామాకు పంపించండి

**మరనాత మెసేంజర్, గాయత్రి నగర్, విజయవాడ - 520 008.**

**Phone : 0866 - 2480047 e-mail : mvs828@gmail.com**

**: Bank Details :**

**THE SOUTH INDIAN BANK LTD.**

**A/c. No. 0142073000000861 IFSC : SIBL0000414**



ప్రకటన వివరాలు

పూర్తి పేజి : రూ. 1,500/- అరపేజి : రూ. 800/-

టైటిల్ పేజి 3 లేక 4 : పూర్తి పేజి రూ. 3,000/- అరపేజి రూ.1,500/-


| | స్వదేశములో | విదేశములో |
|---|---|---|
| సాలుసరి చందా | రూ. 150/- | రూ. 1,000/- |
| పోషక సభ్యత్వం | రూ. 1,000/- | రూ. 3,000/- |
| జీవిత సభ్యత్వం | రూ. 5,000/- | రూ. 15,000/- |


This Magazine is Printed, Published and Owned by G. Moses Choudary & Printed at Alpha & Omega Publications & Printing Works, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008. This Magazine is Edited by G. Moses Choudary, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008.

# లూకా సువార్త
## (35 వ భాగము)

**శ్రీ జి. మోజెస్ చౌదరి, విజయవాడ**

## గాలి వాన మధ్యలో ... : (లూకా సువార్త 8 : 22-25)

పాఠకమిత్రులైన మీరంతా కుశలమేకదా ! దేవుని కృప, కనికరము, కరుణా కటాక్షములను అనుభవిస్తూ జీవితాన్ని ధన్యచరితం చేసుకోవడంలో మీవంతు కృషి చేస్తున్నారా? దేవుని సేవిస్తూ ఆయనయందు భయభక్తులు కలిగిఉండడములో మీ బాధ్యతను నమ్మకముగా నిర్వహిస్తే నిర్వర్తిస్తే దేవుని దీవెన సిరులు మీకు సంక్రమిస్తాయి.

ఈరోజు లూకా సువార్త 8: 22-25 వరకు గల లేఖనభాగాన్ని ఆధారము చేసుకొని ధ్యానంచేద్దాం. **"మరియొకనాడు ఆయన తన శిష్యులతో కూడ ఒక దోనెయెక్కి సరస్సు అద్దరికి పోదమని వారితో చెప్పగా, వారు ఆ దోనెను త్రోసి బయలుదేరిరి. వారు వెళ్లుచుండగా ఆయన నిద్రించెను. అంతలో గాలివాన సరస్సుమీదికి వచ్చి దోనె నీళ్లతో నిండినందున వారు అపాయకరమైన స్థితిలో ఉండిరి. గనుక ఆయనయొద్దకు వచ్చి- ప్రభువా ప్రభువా, నశించిపోవుచున్నామని చెరప్పి ఆయనను లేపిరి. ఆయన లేచి, గాలిని నీటిపొంగతును గద్దింపగానే అవి అణగి నిమ్మళమాయెను. అప్పుడాయన- మీ విశ్వాసమెక్కడ అని వారితో అనెను. అయితే వారు భయపడి- ఈయన గాలికిని నీళ్లకును ఆజ్ఞాపింపగా అవి లోబడుచున్నవే; ఈయన యెవరో అని యొకనితో నొకడు చెప్పుకొని ఆశ్చర్యపడిరి" (లూకా 8: 22-25).**

ఒకనాడు గలిలయ సముద్రపు ఒడ్డున ఉన్న శిష్యులకు- అద్దరికి పోదము రండి అని యేసు ఇచ్చిన పిలుపును పురస్కరించుకొని ఆయన శిష్యులు ఆయనను కూడ దోనెలో ఎక్కించుకొని బయలుదేరారు. ఈ శిష్యులు ఒకప్పుడు గలిలయ సముద్రములో నావలు నడపటము, చేపలు పట్టడములోను నేర్పరులు. వారి జీవనమే సముద్రముమీద ఆధారమైన చేపలుపట్టేవృత్తి.

అమ్మా, అయ్యా- ప్రభువైన యేసుయొక్క సువార్త సందేశాలు విని ప్రభువే నిజదేవుడని నమ్ముకొన్నారు. కాలగమనాన మీకు శ్రమలు, సమస్యలు ఎదురవుతున్నాయి. బంధువులు, కులస్థులు, మతస్థులు, గ్రామవర్గం, స్నేహితులు ప్రభువును నమ్ముకొన్నందుకు మిమ్ములను విడిచిపెట్టి మాటలతోను చేతలతోను వేధిస్తూ ఉండవచ్చు. వీటికితోడు ఆర్థిక, అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితులన్నీ ప్రతికూలంగా మారినప్పుడు- యేసుప్రభువును నమ్ముకొంటే సమస్యలన్నీ పోతాయనుకున్నాం కదా, మరి ఇన్నిసమస్యలు ఎందుకు రావాలి అంటూ ఆవేదన

చెందుతున్న వాళ్లని ఎంతోమందిని చూస్తున్నాను. దేవునిసన్నిధిలో నీవు కార్చిన కన్నీరు దేవుడు తన సముఖములో దాచిఉంచిన పుస్తకములో లిఖితరూపములో భద్రంచేసి పెట్టాడు. దేవుని సన్నిధిలోని బుడ్లలో నీవుకార్చిన కన్నీరు నిలువచేయబడి ఉన్నాయి. మీరు భయభక్తులుతో ప్రభువును సేవించే విధము వృధాగా పోలేదు. నీ భక్తి నీకు అక్కరకు వస్తుంది. దేవుడు నిన్ను ఈ పరీక్షకాలములో పరిశోధిస్తూఉండగా డిస్టింక్షన్‌లో పాసయినట్లయితే దేవుడు నిన్ను బహుగా ఆశీర్వదిస్తాడు.

ఎన్నో సంవత్సరాలుగా ఎంతోనమ్మకముగా దేవుని సేవిస్తున్నాను, సంఘానికి కానుకలు, దశమభాగాలు,స్వేచ్ఛార్పణలు ఇస్తున్నాను. నాకు ఇన్ని చిక్కులు, సమస్యలు ఏమిటని మీకెవరికైనా ప్రశ్న కలిగిందా? యేసు అద్దరికి వెళదామంటే ఆయన శిష్యులు ఆయనతో బయలుదేరారు, బాగానేఉంది. ఇద్దరినుంచి అద్దరికి చేరే దారిమధ్యలో ఏ చిక్కులు రావని ప్రభువు నీకు చెప్పలేదుగా! ఏ చిక్కులు రావని నువ్వు భ్రమపడ్డావుకదా! ప్రభువైన యేసును నమ్ముకున్న దరిమిల ఉన్న చిక్కులు పోయేమాట నిజమే, కాని కొత్తచిక్కులు రావని ఏమీలేదు. ఈ లోకం పాపభూయిష్టమైనది. మన అత్యాశలవల్ల లేక మనం చేసుకొనే తప్పు నిర్ణయాల ప్రభావము వల్లనో చిక్కు పరిస్థితులు అనేవి ఏదోఒక రూపములో వస్తాయి. అవి మనలను మెరుగు పరచడానికే గాని కీడు చేయడానికి మాత్రం కాదు. ఆ కష్టనష్టాల్లో నమ్మకత్వంచూపుతూ దేవున్నిఆశ్రయించి ఆయననుస్తుతిస్తూ జీవిస్తున్నట్లయితే దేవుడు మిమ్మును బహుగా ఆశీర్వదించగోరు తున్నాడు. ఈ దేవుడు మిమ్మును ఎప్పుడూ విడిచిపెట్టువాడు కాడు.

వెనుకటికి ఒకవిశ్వాసి- నేనింతకాలం నమ్మకముగా ప్రభువును సేవించాను కాని ప్రభువు నన్ను విడిచి పెట్టేసాడు. అందుకే నాకిన్ని కష్టాలు, శ్రమలు వచ్చాయి అని వేదనతో ఏడ్చిఏడ్చి పడుకున్నాడు. ఆ రాత్రి కలలో సముద్రతీరాన ఇసుకతిన్నెలమీద నాలుగు పాదాల జాడలు కనబడుతున్నాయి. కొంతదూరం వెళ్లిన తరువాత రెండు పాదాలజాడలు మాయమైపోయి రెండు పాదాల జాడలు మాత్రమే కనబడు తున్నాయి. ఆ విశ్వాసి కలలోనే అనుకొంటున్నాడు- నాలుగు పాద జాడలు కనబడినప్పుడు ప్రభువు నాతోకూడ నడిచాడు. రెండు పాదాల జాడలు మాత్రమే కనబడినప్పుడు ప్రభువు నన్ను విడిచిపెట్టేసాడు. నేననుకున్నట్లే ప్రభువు నాకు దూరమైపోయాడు. అందుకే నాకిన్ని కష్టాలు, నష్టాలు, సమస్యలు ఎదురవుతున్నాయి అని కలలోనే చాలా వేదన చెందుతూఉండగా.. అప్పుడొక స్వరము వినబడుతూఉంది- “నా కుమారుడా, నాలుగు పాదాల జాడలు ఉన్నప్పుడు నువ్వు నాతో, నేను నీతో కలసి నడచిన మాటనిజమే. కానీ నీకు సమస్యలు, చిక్కు పరిస్థితులు రాగా నన్ను గూర్చి అసంతృప్తి పడ్డావు. చింతించడం, దిగులు పడడము మొదలు పెట్టావు. నీ సమర్పణలో, నీ ప్రార్థనలో బలహీనపడ్డావు. నువ్వు నడవలేని స్థితిలోకి వెళ్లిపోయావు. అప్పుడు నేను నిన్ను నా చేతులమీద ఎత్తుకొని మోసుకొంటూ నడిచాను. అప్పుడు నా రెండు పాదాల జాడలు నువ్వు చూస్తున్నావు నా

కుమారుడా. నేను నిన్ను ఎన్నడూ విడువను, ఎడబాయను. నా బిడ్డలకు కష్టకాలం వచ్చినప్పుడు వాళ్లను విడిచిపెట్టి వెళ్లే దేవుడను కానయ్యా నేను. ఇశ్రాయేలును కాపాడువాడు, కునుకడు, నిద్రపోడు అన్న నామాట జ్ఞాపకానికి తెచ్చుకో". అని దేవుని స్వరం మాట్లాడగా మెలకువ కలిగిన ఆ సోదరుడు లేచి కన్నీటితో దేవుని స్తుతించాడట.

మీరు దేవునిలో మరింత బలపడడానికి, మీ ప్రవర్తన మరింతగా మెరుగుపడడానికి వచ్చిన కష్టాలను చిక్కులను దేవుడు మీకిచ్చిన అవకాశముగా భావించాలి గాని ఏదో కీడు వచ్చేసినట్లుగా భావించడం చేతగానితనమవు తుందని చెప్పకతప్పదు. ఎందుకంటె దేవుడు తన లేఖనాలలో- '**శ్రమదినమున కృంగినవాడవైతే చేతగానివాడవగుదువు**' అని సెలవిచ్చెను. అందుచేత చేతగానివాళ్లలా, కృంగిపోయేవాళ్లలా కాకుండా పొంగిపోయేవాళ్లలా ఉందాం!

అద్దరికి పోదామని యేసు ఇచ్చిన పిలుపును ఆధారం చేసుకొని శిష్యులందరూ యేసయ్యతోపాటు దోనెలో వెళుతూ ఉంటే పెనుగాలులు వచ్చినవి. యేసుఉన్న దోనెమీద పెనుగాలులు రావడమేమిటి? అవునుమరి, యేసుప్రభువు ఉన్న దోనెమీదికే పెనుగాలులు వస్తాయి! మిగిలిన దోనెలమీదికి రావు. ఆ భక్తిహీనులు అంత వర్ధిల్లుతున్నారేమిటి? అని ఆలోచిస్తున్నారా? దావీదు దేవుని పిలుపు, దేవుని ఎన్నిక, ప్రణాళిక చొప్పున గొల్యాతును చంపిన దరిమిల సౌలురాజు ఇంటికి అల్లుడయ్యి, రాజాంతఃపుర వాసములోనికి వచ్చాడు. కాని ఇప్పుడు మామగారైన సౌలురాజు దావీదుమీద అసూయ ద్వేషములు పెంచుకొని అతనిపై ఈటెలు విసిరి చంపెయ్యాలని తరుముతూ ఉన్నప్పుడు కొండల, కోనలపాలైన దావీదు ఒకరోజు ఒక ఊరిలోనుంచి వెళుతూఉండగా మొలిచిన చోటనే విస్తరించిన వటవృక్షంలాంటి పెద్ద భవనము కనపడిందట. అదేమిటండీ, మొలిచినచోటనే విస్తరించిన వటవృక్షములాంటి ఈ భవనము ఎవరిదండీ అని అడిగాడట. అదా, అది మిష్టర్ భక్తిహీనుడుది అని చెప్పాడు. భక్తిహీనులు ఇంతగా వర్ధిల్లుతారా? భక్తిభావం కలిగిన, దేవునిచేత ఎంచుకోబడిన నేను ప్రాణాలు దక్కించుకోవడానికి అడవులపాలై ఊరూరూ తిరుగుతూ దాక్కుంటూ ఉండాల్సిన పరిస్థితి వచ్చిందే, పిల్లనిచ్చిన మామగారు పిల్లను కాపురానికి పంపకపోగా సైన్యాన్ని వెంటేసుకొని చంపాలని తరుముతున్నాడే- అని చాలా ఆశ్చర్యచకితుడౌతూ వెళ్లాడట. ఆ తరువాత కొంత కాలానికి మళ్లీ అదే ఊరిలోనుంచి వస్తున్నాడు, అంతకుముందు మొలిచినచోటనే విస్తరించి వటవృక్షంవలె ఉన్న మిష్టర్ భక్తిహీనుడిగారి భవంతి కొరకు చూసాడు. ఎక్కడా కనపడడము లేదు. ఏమండీ, ఇక్కడ మిష్టర్ భక్తిహీనుడిగారి భవన సముదాయం ఉండేదికదా, అది ఇక్కడేనా, ఇంకెక్కడైనా ఉందా? అనిఅడిగితే- ఇక్కడే ఉండేది బాబూ, కాని ఇప్పుడు అది లేకపోయెను, అతడు లేకుండా పోయాడు అన్నారు. దాన్ని గూర్చి దావీదు తన కీర్తనలో- '**భక్తిహీనుడు ఎంతో ప్రబలియుండుట నేను చూచి యుంటిని అది మొలిచిన చోటనే విస్తరించిన చెట్టువలె వాడు వర్ధిల్లియుండెను. అయినను ఒకడు ఆ దారినిపోయి చూడగా వాడు లేకపోయెను**

**నేను వెదకితిని గాని వాడు కనబడకపోయెను' (37 కీర్తన: 35, 36)**. అని వ్రాసెను.

క్షమ, ఓర్పు, నేర్పుతో కష్టకాలములో దేవునికొరకై నిలబడే కుటుంబాలు, విశ్వాసులు, సేవకుల కొరకై దేవునికి స్తోత్రం కలుగునుగాక. భక్తిహీనులయొక్క వర్ధిల్లతను చూచి ప్రభువును నమ్ముకొన్న నాకేమిటి ఈ సమస్యలు, అనారోగ్యాలు, ఆర్థిక ఇబ్బందులు అని ప్రశ్నవేసుకోవడము కంటె ఆనాడు దోనెలోఉన్న శిష్యగణం చేసినపనిని మనంకూడ చెయ్యాలి. ఏమిటంటే- 'ప్రభువా, ప్రభువా, మమ్ములను రక్షించుము. మేము నశించిపోతున్నాం, ప్రమాదములో ఉన్నాం అని వాళ్ల బాధను చెప్పుకున్నారు. మరొకచోట బోధకుడా, బోధకుడా మేము నశించిపోతున్నాం, నీకు చింతలేదా అంటూ ఆక్షేపణతో కూడిన అభ్యర్ధనచేయటం చూస్తాం. దేవునిపై ఎన్నడూ అసంతృప్తిని వ్యక్తం చేయబోకండి. మేము నశించిపోయినా నీకేం పట్టదా అని ఆక్షేపణతోకూడిన పార్థనలు, అభ్యర్థనలు దేవుడు ఆమోదించే ప్రార్థనావిధం కాదని మనవిచేస్తున్నాను.

అయితే యేసు, ఆ దోనెలో అసలు వీళ్లేం చేస్తారోనని చూస్తున్నాడని అనుకుంటాను. శ్రమకాలమొచ్చినప్పుడు మనమేం చేస్తున్నామో దేవుడు పరీక్షగా చూస్తున్నాడు. దేవుని సన్నిధిని ఆశ్రయించి ప్రార్థిస్తారో లేక ఆయనమీద అసంతృప్తితో ఆక్షేపణను చేస్తారోనని కనిపెట్టి చూస్తున్నాడని అనుకొంటాను. ప్రభువైన యేసులేచి ముందుగా సముద్రాన్ని గాలిని గద్దించాడు. ఆ గద్దింపును గూర్చి గ్రీకుభాషలో వాడబడిన పదజాలాన్ని పరిశీలనచేస్తే- నోరుమూసుకో సముద్రమా, గాలి ఏమిటలా పెట్రిల్లిపోతున్నావు? అనిఅర్థం. మరొకమాటలో చెబితే- నీ నోటికి చిక్కము కట్టుకోఅని అర్థం. పంటచేలలో కుప్పనూర్పిళ్లు జరిగేటప్పుడు బంతిమీద తిరిగే ఎడ్లు గబుక్కున రాశిమీదకు వెళ్లి ఆ క్రొత్తధాన్యమును బొక్కేసే ప్రమాదముంది కాబట్టి ఎడ్లు మూతికి చిక్కము కడతారు. ఆ విధంగా బలమైన గాలికి సముద్రము అలలు బలంగా గర్జిస్తుంటే ఆ గాలిని సముద్రమును నీనోటికి చిక్కము కట్టుకో, ఏమిటా గర్జించడం అని గద్దించాడు యేసయ్య. వెంటనే చప్పబడిపోయినట్లుగా గాలులు, అలలు తగ్గిపోయాయి. సముద్రం నిమ్మళించింది, దోనె సాఫీగా పోవడానికి అనువైన పరిస్థితిఏర్పడింది.

అప్పుడాయన - మీవిశ్వాసం ఏమయింది? నేను ఈ దోనెలో లేనా? అద్దరికి పోదామని పిలిచాగాని, నట్లేట్లో మునిగిపోదురని పిలువలేదు కదా? అని శిష్యులను గద్దించాడు. కష్టకాలంలోఉన్న దేవుని ప్రజలారా, ఇహ లోకమనే ఇద్దరినుంచి దేవుని పిలుపునందుకొని ప్రయాణమయ్యారు. ఇద్దరికి, అద్దరికి అంటే ఈలోకానికి - పరలోకానికి మధ్యలో జీవిత గమనా గమనాలమధ్య అలలు, గాలులు (శ్రమలు, కష్టాలు) వచ్చి కొట్టినప్పుడు ఇక్కడే మునిగిపోవడానికి దేవుడు మిమ్ములను పిలువలేదు. యేసునాధుడు ఉన్న మన నావ అద్దరికి చేరుతుంది. ఈ జీవిత నావలో యేసు ఉన్నంతవరకు మనకేమి భయము లేదు. ఈ నిజాన్ని నిశ్చయంగా ఎరిగి ముందుకు సాగిపో, దేవుడు నీకు తోడై కష్టకాలములో నీ కుటుంబాన్ని ఆపద్బాంధవుడై అద్భుతంగా ఆదుకొనును గాక !

**- మరనాత.**

# క్రైస్తవ / బైబిలు వేద విద్యా సంస్థలు - గుర్తింపు ఆవశ్యకత

**Dr. Nireekshana K. Kancharla**
**M.A., MBA., M.A., M.Div., M.Th., D.Min., Ph.D. in Phil, AU. AP,**
**Director : Maranatha Theological Seminary Hyderabad**

దేనికైనా, అనగా ఏ వస్తువుకైనా, ఏ వ్యవస్థకైనా, విద్యకైనా కొన్ని ఆరోగ్యకరమైన ప్రమాణాలు, మెరుగైన నియంత్రణలు ఉండటం ప్రయోజనం. మనకు తోచినట్లు వ్యవస్థను నడిపినా, విద్యాలయాలు నడిపినా, సంఘములు నడిపినా ఆ యా విభాగాలలో పాటించ వలసిన నాణ్యత కుంటుపడి నాసిరకపు ధోరణులు / వితండవాదములు ప్రబలి మనిషి అస్థిత్వాన్ని ప్రశ్నిస్తాయి. ఆ పరిస్థితులను ఈ రోజుల్లో దాదాపు అన్ని రంగాలలో మనందరం చూస్తున్నాము.

'విద్య' ప్రజలకు విజ్ఞానాన్ని, సంస్కారాన్ని, బాధ్యతలను తెలియచేసే అద్భుతమైన అతి పురాతన వ్యవస్థ, ప్రపంచ మేధావులనబడిన వారి మేధస్సు పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలలోనే సానపెట్టబడింది. విద్యనభ్యసించవలసిన పద్ధతులను వారు అనుసరించి ఎన్నో నూతన ఆవిష్కరణలకు కారణమయ్యారు. వాటి ఫలితాల్నే మనం ఈనాడు అనుభవిస్తున్నాము.

అయితే ఈనాడు కొన్ని విద్యాసంస్థలు, విద్యను వ్యాపారంచేసి, విద్యార్థుల జీవితాలలో ఉన్న సృజనను మంటగలిపి కృత్రిమ ఫలితాల ద్వారా లబ్ధిపొందుతున్నారు. తద్వారా దేశ ప్రగతి, ఔన్నత్యము కుంటుపడి విలువను కోల్పోతున్నాము. అలాంటి విద్యనభ్యసించిన కొంతమంది, వారి వారి విభాగాలపై పట్టులేకుండా పరిస్థితులను విశ్లేషించే మానసిక స్థాయి, పరిపక్వత లేనందున ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు పలు ఇక్కట్లు పడుతూ నవ్వుల పాలౌతున్నారు.

అందులో భాగమన్నట్లుగా బైబిలును బోధించే విద్యాసంస్థలు ఈనాడు ఎక్కడపడితే అక్కడ పుట్టుకొస్తూ, కనీస ప్రమాణాలు పాటించకుండా, మాకు, మా సంస్థకి ఒక బైబిలు స్కూలు ఉండాలన్నట్లుగా వారికి తోచిన పద్ధతిలో నడుపుతున్నారు. వారు కొంతమంది విద్యార్థులను ఆకర్షించి వారికి సరిగా వేద విద్యను నేర్పింపక, వారిలోని తప్పుడు భావాలను సరిచేయలేక, ఏదో ఒక బోధ చేసి సరిపెట్టుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యము పొందిన డిగ్రీల ధృవీకరణ పత్రాలను అందజేస్తున్నారు. తద్వారా విద్యార్థులు విలువైన కాలమును వృధా చేసుకుంటూ, తమకు లేని సామర్థ్యము ఉన్నట్లుగా భ్రమిస్తూ, త్యాగ సహితముగా సేవ చేయువారికి ఇబ్బందులు సృష్టిస్తున్నారు. అర్హత లేనివారు డిగ్రీలను పొంది తప్పుడు బోధలు చేస్తూ వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగించడం శోచనీయం. బైబిలు వేద విద్య విషయములో నిరక్షరాస్యులు,

అక్షరాస్యులమనే భ్రమలో ఉండి లేఖనములను తప్పగా వ్యాఖ్యానించి ప్రజలను తప్పు దారిలో నడిపిస్తూ ఆధ్యాత్మిక అసాంఘిక శక్తులుగా మారడం ప్రమాదకరం. బైబిలు విద్యాలయాలను ఏర్పాటుచేసుకోవడం తప్పకాదు గాని వాటిని సక్రమ నియంత్రణలో లేఖన పరిజ్ఞానము కలిగిన అర్హులైన ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నడిపించడం శ్రేయస్కరం.

ఏ విధమైన వేదవిద్యను కొంతమంది సేవకులు పొందకపోయినా, దేవునిపై ఆధారపడి, పరిశుద్ధాత్మ ఆలోచనల చొప్పున సేవచేసి, చేస్తున్న యోగ్యులైన దైవ సేవకులున్నారు. వారు దేవుడిచ్చిన స్వీయజ్ఞానంతో గొప్ప సేవ చేస్తున్నారు. వారు సేవలోకొచ్చిన రోజుల్లో వేదవిద్యా కేంద్రాలు అందుబాటులో లేనందున లేదా అందు చదివే వెసులుబాటు లేనందున, దేవుడే వారికి ఉపాధ్యాయుడుగా ఉండి, వారిని అద్భుతంగా వాడుకుంటున్నాడు. వారిని మినహాయిస్తే చాలామంది ఈనాడు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అవరోధములుగా ఉన్నారు. ప్రజలను ప్రభువు వైపునకు కాకుండా వారివైపునకు ఆకర్షిస్తున్నారు. ప్రభావ సువార్తను గాక, ప్రలోభ సువార్తను బోధిస్తున్నారు. నాణ్యమైన సువార్తను గాక నాసిరకపు సువార్తను ప్రకటించి ఘనులుగా సమాజంలో చెలామణౌతున్నారు.

పై అనాలోచనలకు తోడు, ఏ ప్రభావమో, ఏమోగాని క్రైస్తవ వేదవిద్య డిగ్రీలను అంగడిలో సరుకులా అమ్మటం, వాటిని కనీస అర్హతలేని వారు కూడా ఎగబడి కొనటం బహువిడ్డూరంగా జరుగుచున్నది. 'క్రైస్తవ డిగ్రీల వ్యాపారం' రోజుకొక పేరుతో క్రైస్తవ వేదవిద్యా సంస్థల పేరిట ఉనికిలోకొచ్చి అసలైన క్రైస్తవ విద్య ప్రమాణస్థాయిని దిగజారుస్తున్నారు. ఎంతో విలువైన కాలం, లక్షల సొమ్ములు, సామర్థ్యం వెచ్చించి చదివి డిగ్రీలను పొందినవారికి విలువలేకుండా అడ్డదారిలో అర్హతలేని వారు ఉన్నత డిగ్రీలను తగిలించుకోవడం ఆ డిగ్రీలకే అవమానం. కనీస విద్యార్హత, సరియైన సేవానుభవం లేకపోయినా ప్రపంచంలోని అత్యుత్తమ డిగ్రీలను అనగా **M.A., M.Div., M.Th., D.Min., Ph.D.** లను కొన్ని రోజులు, నెలలు వ్యవధిలో బహుకరించటం బహువిడ్డూరం.

ఉదాహరణకు : 12 సంవత్సరాల ప్రాథమిక విద్యానంతరం B.A./B.Th. బ్యాచిలర్ డిగ్రీలను 3 సంవత్సరములు చదివిన తరువాత M.A. పూర్తిచేయటానికి 2 సంవత్సరములు, M.Div. పూర్తిచేయటానికి 3 సంవత్సరములు, M.Th. పూర్తిచేయటానికి 2 సంవత్సరములు మరియు డాక్టరేట్ పూర్తిచేయటానికి 4 1/2 సంవత్సరముల నుండి 5 సంవత్సరములు పట్టును మరియు వారు ఆయా డిగ్రీలను చదువునప్పుడు ఎన్నో పరీక్షలు, పరిశోధన పత్రములు సమర్పించవలసి ఉన్నది. అంతేగాకుండా కోర్సు చివర్లో ఏదేని నిర్దేశిత అంశంపై కొన్ని అరడజన్ల నెలలు పరిశోధన చేసి వందల పేజీల (పేజీలు 300 - 500) Thesis సమర్పించవలెను. అట్టివాటితో నిమిత్తము లేకుండా ఆయా డిగ్రీలను బహుకరించటం, స్వీకరించటం అనైతికం, అక్రమం. తమకు సంబంధించనివి, యోగ్యత లేని వాటిని సొంతం చేసుకోవటం తప్పుగదా! సక్రమంగా, చదివి పొందటం తప్పులేదుకాని డిగ్రీలను కొనటం అమ్మటం నేరం. అయినా అలాంటి అత్యుత్తమ

డిగ్రీలను బహుకరించటానికి వారికున్న అర్హతేమిటి? స్వీకరించటానికి వీరికున్న నిబద్ధతేమిటి? ప్రభువును విశ్వసించకముందు అది చేశాను, ఇది చేశాను, దొంగతనం చేశాను, తప్పునొప్పుకున్నాను, దేవుడు క్షమించాడని సాక్ష్యాలు చెప్పేవారు, తమకు అర్హతలేని వాటిని, తమవి కానివాటిని అడ్డదారిలో పొందటం తప్పకాదా!? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి!? చదువుకోవటం ధర్మం గాని, చదువును కొనటం అధర్మం. అట్టివారు ఆత్మ విమర్శ చేసుకొని, నిజాయితీతో కూడిన సేవలందించటం హర్షణీయమౌతుంది.

ఇంకొక విషయమేమిటంటే.. గౌరవ డాక్టరేట్లు.. సేవలో అపారమైన అనుభవముగలిగి, అనగా పెద్దల హస్తనిక్షేపణము (ORDINATION) పొంది, ప్రభు సేవలోకి వచ్చి 20 లేక 25 సం॥ లు సేవానుభవము కలిగి అన్నింటిలో అనగా, వ్యక్తిగత, కుటుంబ, బహిరంగ, ఉపదేశములలో మంచి సాక్ష్యములు పొందిన వారికి అదే స్థాయిలో గుర్తింపు పొందిన వేద విద్యా సంస్థలు గౌరవ డాక్టరేట్లు (D.D. - DOCTOR OF DIVINITY) ని బహుకరించవచ్చును. అట్టివారిని సత్కరించుకోవటం మనకు గౌరవం. వీటిని మినహాయించి మరే యితర పద్ధతుల ద్వారా ఆర్థిక లబ్ధిని ఆశించి, పెద్ద పెద్ద డిగ్రీలను గుర్తింపు లేని సంస్థలు అనర్హులకు ప్రకటించడం ఆధ్యాత్మిక అరాచకంతో సమానం.

భారత ప్రభుత్వము, క్రైస్తవ వేద విద్యామండలి ప్రతినిధులు సూచించిన వేదవిద్య ప్రమాణస్థాయి, గుర్తింపు ప్రాధాన్యతలను పరిశీలిద్దాం.

క్రైస్తవ వేద విద్యను నేర్చుకోవాలనే వారి సంఖ్య ఈ మధ్యకాలంలో ఎక్కువైనందున కొన్ని నామమాత్ర విద్యాసంస్థలు విద్యార్థుల ఆసక్తిని సొమ్ముచేసుకుని, సరియైన ప్రమాణాలు పాటించకుండా తప్పడు బోధకులను తయారు చేస్తున్నారు. ఇవి ఈనాడు ఎలా ఉన్నాయంటే 'FAST FOOD CENTERS' గా ఉన్నాయి. వేగంగా తయారు చేసే ఆహార పదార్థాలవలె వేగంగా నేర్చుకొనే తర్ఫీదు కేంద్రాలను సృష్టించి, బహు చులకనగా దేవుని సంగతులను బోధిస్తున్నారు. అట్టి కేంద్రాలకు సరియైన గ్రంథాలయాలు, విద్యా ప్రణాళిక, తరగతి గదులు, గుర్తింపుపొందిన వేదవిద్యా సంస్థలలో తర్ఫీదుపొందిన అర్హులైన ఉపాధ్యాయులను నియమించకుండా వారికి తోచినట్లుగా అనర్హుల ఆధ్వర్యంలో నడిపిస్తూ సమర్థులను అసమర్థులుగా చేయటం బహు విచారకరం.

ACCREDIATION (గుర్తింపు - దృవీకరణ) భారతదేశంలో విద్యావిధాన గుర్తింపు కేంద్రంలోని ప్రత్యేక విద్యా నిఘా విభాగానికి చెందినది. దానిని UGC (యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్) మరియు AICTE (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఈ విభాగాలు ప్రధానంగా కొన్ని ప్రమాణాలు ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు విశ్వవిద్యాలయాలలో అమలు జరిగేటట్లు చూస్తారు. వీటితోపాటు NAAC (నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) కూడా UGC ఆధ్వర్యంలో పనిచేస్తుంది. అదేవిధంగా NBA (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) AICTE తో కలిసి సాంకేతిక విద్యా ప్రమాణ స్థాయిలను నియంత్రించటం జరుగుతుంది.

ఒకప్పుడు మామూలు పాఠశాలల యాజమాన్యం కేంద్ర విద్యా ప్రమాణాలను పాటించటం తప్పనిసరియైనప్పటికిని యాజమాన్యాలు కొంత అలసత్వం చూపేవారు. కాని, ఇప్పుడు వాటిని తప్పక పాటించాలని చట్టం చేయటమైనది. అంతేకాకుండా దూరవిద్యకు కూడా UGC వారు ODL (ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్) కు అనుమతినిచ్చారు.

క్రైస్తవ విద్యా సంస్థలను నియంత్రించటం UGC పరిధిలో లేనందున కొంత కష్టంగా మారింది. అయితే క్రైస్తవ వేద విద్యా ప్రమాణాలను కాపాడటంలో ఇండియాలో UGC ప్రమాణాలతో సరిసమానముగా రెండు ప్రధాన సంస్థలుగా గుర్తింపు పొందాయి. అవి. 1. ATA (ఏషియా థియోలాజికల్ అసోసియేషన్) మరియు 2 . BTESSC (థియోలాజికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ది సెనేట్ ఆఫ్ సిరంపూర్ కాజేజి) భారతదేశంలోని ప్రముఖ క్రైస్తవ వేద విద్యాలయాలు ATA మరియు BTESSC నుండి గుర్తింపు పొంది నడుపబడుతున్నాయి. ATA సంస్థ WEA (వరల్డ్ ఇవాంజిలికల్ ఫెలోషిప్) వారి భాగస్వామిగా ఉండి ప్రపంచవ్యాప్తంగా వేదవిద్యా ప్రమాణస్థాయిని సూచిస్తూ, తరచుగా పర్యవేక్షిస్తూ గుర్తింపునిస్తున్నాయి.

మరికొన్ని సంస్థలు కూడా వేద విద్యా ప్రమాణస్థాయిని సూచిస్తున్నాయి. NATA (నేషనల్ అసోసియేషన్ ఫర్ థియోలాజికల్ అక్రిడిటేషన్), IIM (సెనేట్ ఆఫ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిస్సియాలజి), PATA (పెంటికోస్టల్ అసోసియేషన్ ఫర్ థియోలాజికల్ అక్రిడిటేషన్), BATA (బాప్టిస్ట్ అసోసియేషన్ ఫర్ థియోలాజికల్ అక్రిడిటేషన్) మరియు IATA (ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ థియోలాజికల్ అక్రిడిటేషన్) ఇలా పై సంస్థల వారు సేవలందిస్తున్నారు.

ప్రస్తుతము భారత దేశంలో రెండు క్రైస్తవ విశ్వవిద్యాలయాలు UGC తో గుర్తింపు పొందాయి. MARTIN LUTHER'S CHRISTIAN UNIVERSITY, షిల్లాంగ్ మరియు SAMHIGGIN BOTTOM INSTITUTE OF AGRICULTURE, TECHNOLOGY AND SCIENCE, అలహాబాదు, అదేవిధంగా SAIACS (సౌత్ ఏషియా ఇనిస్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్డ్ క్రిస్టియన్ స్టడీస్) కొన్ని డిగ్రీలను, అనగా M.A. IN CHRISTIAN STUDIES & M.Th (M.Phil.) ను మైసూర్ యూనివర్సిటీ గుర్తింపుతో అందిస్తున్నారు. అదేవిధంగా ACTS, బెంగళూరు విద్యాసంస్థ వారు భారతదేశ ప్రముఖ విశ్వవిద్యాలయాలలో ఒకటైన 'ఆంధ్రా యూనివర్సిటీ' వైజాగ్, ఆంధ్రప్రదేశ్ ద్వారా గుర్తింపు పొంది Ph.D. డిగ్రీని రెలిజియన్ అండ్ ఫిలాసఫి డిపార్ట్‌మెంట్ ద్వారా అందిస్తున్నారు.

అంతేకాకుండా ATA అక్రిడిటెడ్ డిగ్రీలైన B.Th. (బ్యాచిలర్ ఆఫ్ థియోలజి) మరియు M.Div. (మాస్టర్ ఆఫ్ డివినిటి) లను ప్రముఖ 'మద్రాస్ యూనివర్సిటీ' గుర్తించి M.A. IN CHRISTIAN STUDIES మరియు M.Phil. IN CHRISTIAN STUDIES కు అవకాశం కల్పించారు. ఈమధ్యే ATA గుర్తింపు MARTIN LUTHERS' CHRISTIAN UNIVERSITY కి లభించింది.

అయితే అనేక క్రైస్తవ వేద విద్యా సంస్థలు, ఎవరితోనూ నిమిత్తం లేకుండా, ఏ విధమైన గుర్తింపు లేకుండా, యువతీయువకులను ఆకర్షించి, తమ విద్యా సంస్థలలో చేర్చుకొని, తమదగ్గర చదివిన విద్యార్థులు పై చదువులకు వేరే కాలేజీలకు వెళ్ళి ఉన్నత విద్య నభ్యసించడానికి అవకాశం లేని డిగ్రీలను బహూకరించి నడుపుతున్నారు. **తద్వారా సరియైన గుర్తింపులేని పాఠశాలల డిగ్రీలు గుర్తింపు పొందిన కాలేజీలలో చెల్లుబాటు కావు. పై చదువులకు వెళ్ళే విద్యార్థులు నష్టపోతున్నారు.**

మరొక సంగతేమిటంటే **ఒకటి, అర డిగ్రీలకు ATA సంస్థ అనుమతి పొంది, ఆ పేరును వాడి, అదే విద్యా సంస్థలో అనుమతి పొందని ATA డిగ్రీలను ప్రకటించి విద్యార్థులను ఆకర్షిస్తున్నారు.** కనుక **ATA లేదా BTESSC గుర్తింపు పొందిన కాలేజీలలో ఏ యే డిగ్రీలకు అనుమతి వచ్చిందో, అనుమతి పొందిన డిగ్రీల కాలపరిమితిని అనగా ATA మరియు BTESSC నుండి అనుమతి లభించిన ధృవీకరణ పత్రములను కూడా పరిశీలించి అడ్మిషన్ పొందటం విద్యార్థుల బాధ్యత. ఆ విషయాన్ని ఆ యా విద్యా సంస్థల వారు వివరంగా అభ్యర్థులకు పై సంగతులను తెలియజేయటం వారి ధర్మం.**

**ఉదాహరణకు :** సరియైన గుర్తింపులేని పెద్దపెద్ద డిగ్రీలనిచ్చే కొన్ని క్రైస్తవ వేదవిద్యా సంస్థలు..

**UNIVERSITY OF JERUSALEM - జెరూసలేం యూనివర్సిటీ**

**EZRA UNIVERSITY - ఎజ్రా యూనివర్సిటీ**

**FAITH THEOLOGICAL SEMINARY - ఫెయిత్ థియోలాజికల్ సెమినరీ**

**పైన ప్రస్తావించినవి మచ్చుకు కొన్ని మాత్రమే. అలాంటివి కోకొల్లలుగా మన దేశంలో ఉన్నాయి. ఇంకా పుడుతూనే ఉన్నాయి. ఇలాంటి ఆధ్యాత్మిక వ్యాపారుల వలన సువార్త నాణ్యతను కోల్పోయి కొన్ని తరాలు నష్టపోయే పరిస్థితులు కల్పిస్తున్నారు. కనుక ఆసక్తిగల విద్యార్థులు జాగ్రత్తగా పై విషయాలు అడ్మిషన్ సమయంలో పరిశీలించి, గుర్తింపు పొందిన డిగ్రీలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను, డిగ్రీల ధృవీకరణ సంవత్సరాలను క్షుణ్ణంగా పరిశీలించి మీ విలువైన తర్ఫీదు కాలానికి న్యాయం చేసుకోండి. లేదా అనుభవజ్ఞుల సలహా తీసుకోండి.**

దేవుని సేవ చేయటానికి ఇన్ని సంగతులు పరిశీలించటం అవసరమా? అనే ఆలోచన మీలో కొంతమందికి కలగొచ్చు. ఏ శిక్షణ లేకుండా నేను సంఘాలు స్థాపించలేదా? పరిశుద్ధాత్ముడుంటే సరిపోతుంది కదా? ఇవి మంచి ఆలోచనలే కాని, మీ సేవారంభకాలంలో వేదవిద్యా కేంద్రాలు ఎక్కువగా లేనందున, ఉన్నా అవగాహన లేనందున ప్రభువు అట్టివారిని బలంగా వాడుకున్నాడు. **ఈ కాలంలో అవకాశమున్నందున పరిశీలించి విద్యనభ్యసించటం ధర్మమని తెలియజేస్తున్నాము. గనుక సహృదయంతో పాఠకులెల్లరు పై సంగతులను పరిశీలించి తగు సవరణలు, నిర్ణయములు చేయవలసినదిగా కోరుచున్నాము.**

**గమనిక :** ఒకవేళ ఏదేని క్రైస్తవ సంస్థలవారు వారి పరిధిలో వారి సంస్థ దర్శనమునకు అనుగుణముగా ఒక స్వల్ప నిర్ణీతకాల వ్యవధిలో ఆసక్తిపరులకు ప్రాథమిక బైబిలు తరగతులు నిర్వహించుకోవటం వారి పరిధిలో ఉన్న అంశం. అయితే ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యము పొందిన క్రైస్తవ వేదాంత డిగ్రీలను బహూకరించక వేరొక పేరు/ పేర్లతో ధృవీకరణ పత్రములు లాంటివి బహూకరించటం సబబుగా ఉంటుంది. అప్పుడు పైన ప్రస్తావించిన ప్రమాణములు పాటించటం, పాటించకపోవటం వారి వ్యక్తిగత అంశం. గనుక ఈ విషయములు పరిశీలించ మనవి.

## గ్రంధ పట్టిక / BIBLIOGRAPHY


**Ashok Chandra, " Towards an Indian Accreditation System" in Quality Assurance in Higher Education, Edited by Alma Craft (London : Falmer Press, 1992), 96.**

**Distance Education Bureau, "Homepage," University Grants Commission, accessed January 20, 2016, http://www.ugc.ac.in/deb/index.html.**

**Peggy Bell Hendrickson, "Bogus Institutions and Accrediting Bodies," Transcript Research, Revised February 2013, accessed http://cdn.shopfy.com/s/files/1/0910/3412/files/Bogus.pdf on January 2016.**

**Gnanaraj, "Current Trends in Evangelical Theological Education in India," Journal of NATA 2/1 (May 2012) : 51.**

**N. Jayaram, "Higher Education in India: Massification and change," in Asian Universities : Historical Perspectives and Contemporary Challenges, edited by Philip G.Altbach & Toru Umakoshi (Baltimore : Johns Hopkins University Press, 2004), 98.**

**Prathibha Khanna, "Transnational Education : Issues and Implications," in Education in India, edited by Shubha Tiwari (New Delhi : Atlantic, 2007), 82.**

**Siga Arles, "Theological Education in India," Siga Arles and Gnanaraj D eds., Towards Indigenous Missions and Theological Education, (Bangalore : CFCC, 2012), 186.**


**శుభమ్ - మరనాత.**

# ఏం అనుకుంటున్నారు?

సహోదరి ఎ. ఉషారాణి, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ

మరనాత మెసేంజర్ పాఠకులకు ప్రభువైన క్రీస్తు నామమున శుభములు. విజ్ఞానము ఎక్కువగా పెరిగినందువలన ఎక్కడో జరిగే విషయాలు కూడా మనుష్యులకు ఇట్టే తెలిసి పోతున్నాయి. క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే స్పందిస్తున్నారు. ఒకరిగురించి మరొకరు ఏమనుకుంటున్నారో, ఎవరు ఎలా చేస్తే బాగుంటుందో అనే స్పందన - ప్రతి స్పందన కార్యక్రమాలు మనం అక్కడక్కడా చూస్తున్నాము. తనగురించి యితరులు ఏమనుకుంటున్నారో అనే ఆతురత ప్రతి మనిషికి ఉంటుంది. మరి యివ్విధమైన సంఘటన ఒకటి పరిశుద్ధ లేఖనాలలో వ్రాయబడింది. యితరుల గురించి మనము అనుకొనే మాటలు కొంతకాలానికి సమసిపోతాయి కాని యిక్కడ లేఖనాలలో వ్రాయబడిన మరియు మనము అధ్యయనం చేయబోయే సంఘటనలో మన అభిప్రాయం మన జీవితాన్నే మార్చివేస్తుంది. మరి పరిశుద్ధ లేఖనాలలలోనికి వెళ్ళి ఆ భాగాన్ని అధ్యయనం చేద్దాం.

“యేసు తన శిష్యులతో ఫిలిప్పుదైన కైసరయలో చేరిన గ్రామములకు బయలుదేరెను. మార్గములోనుండగా నేను ఎవడనని జనులు చెప్పుచున్నారని తన శిష్యులనడిగెను. అందుకు వారు కొందరు బాప్తీస్మమిచ్చు యోహాను అనియు, కొందరు ఏలియా అనియు, మరికొందరు ప్రవక్తలలో ఒకడని చెప్పుకొనుచున్నారనిరి. అందుకాయన మీరైతే నేను ఎవడని చెప్పుచున్నారని వారినడుగగా పేతురు - నీవు క్రీస్తువని ఆయనతో చెప్పెను. అప్పుడు తన్ను గూర్చిన యీ సంగతి ఎవనితోను చెప్పవద్దని ఆయన వారికి ఖండితముగా చెప్పెను (మార్కు 8 : 27-30).

ఫిలిప్పుదైన కైసరియ పట్టణము పాన్ అనే గ్రీకు దేవుని పేరిట నిర్మించిబడినది. ఆనాడు గ్రీకేయులు పాన్ అనే దేవునిని ప్రకృతి దేవునిగా కొలిచేవారు. తరువాతి కాలంలో ఈ పట్టణమును చతుర్ధాతిపతియైన ఫిలిప్పు ఆక్రమించి అందమైన పట్టణంగా తీర్చిదిద్దాడు. అంతేకాక ఈ పట్టణమునకు ఫిలిప్పుదైన కైసరియ అని నామకరణం చేసి, రోమా చక్రవర్తి యైన కైసరియకు అంకితం చేశాడు. ఈ పట్టణం అందమైనదే కాక పెద్దపెద్ద అందమైన కట్టడాలు కూడా ఉన్నాయి. ఈ పట్టణముకు వచ్చిన తరువాత యేసు తన శిష్యులను ఒక విచిత్రమైన ప్రశ్న వేశాడు - నన్ను గూర్చి ప్రజలు ఏమనుకుంటున్నారు? బహుశా ప్రజలలో ఉన్న సమాచారమును తెలుసుకొను నిమిత్తము కావచ్చు (లేక) ప్రజలలో ఉన్న అభిప్రాయాలను తెలుసుకొను నిమిత్తమో (లేక) ప్రజలు యేసు యొక్క పరిచర్యను ఏవిధంగా అర్థం చేసుకున్నారో తెలుసుకొను నిమిత్తం ఈ ప్రశ్నను అడిగియుండవచ్చు. యేసు తన శిష్యులతో ప్రజలు ఏమనుకుంటున్నారో అడిగాడే కాని మతనాయకులు, పెద్దలు, మతబోధకుల అభిప్రాయాలు అడగలేదు. కేవలము సామాన్యుల మాటలు మాత్రమే తెలుసుకోవాలనుకున్నాడు. ఎందుకంటే వారిలో చాలామంది యేసు నుండి అద్భుతాలు,

కార్యాలు అనుభవించాలనుకున్నారేకాని ఆయనను మెస్సియాగా అంగీకరించడంలో వారిలో అపనమ్మకం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే నమ్మిక, అపనమ్మికల మధ్య యుద్ధము. అయితే ప్రజలు అపనమ్మికలో ఉండిపోవటం ప్రభువుకు యిష్టంలేదు. అందుకే బోధకు, ఆచరణకు, మాటకు, చేతలకు మధ్య వారధి వెయ్యాలనే ఉద్దేశ్యంతోనే ఈ ప్రశ్న వేశాడు.

ప్రభువు యొక్క శిష్యులు ప్రజాభిప్రాయాలను వివిధ రీతులలో తెలియజేశారు. వారి అభిప్రాయాలేవనగా,

**ఎ) యోహాను :** ప్రజలలో కొందరు యేసును గూర్చి బాప్తీస్మమిచ్చు యోహాను అనుకుంటున్నారు. బాప్తీస్మమిచ్చు యోహాను విడుదల గూర్చి ప్రకటించాడు, ధైర్యముగా దైవవాక్కును ప్రజలకు అందించుటయే కాక, మతాధికారులను, ఆచారవ్యవహారాలలో మునిగిపోయిన ప్రజలను ఎదిరించి, సామాన్యులకు అండగా నిలబడ్డాడు. ఎంతటివారైనా ఎదుర్కోగల సత్తా యోహానుకు ఉన్నాయి. తన చేతలతో, మాటలతో ప్రజలను ఆకర్షించిన వ్యక్తి. దైవప్రతిరూపానికి, సాక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన నిరాడంబర వ్యక్తి. అదేవిధమైన లక్షణాలు యేసుక్రీస్తులో కూడా కనిపించాయి. అందువలననే ప్రజలలో అనేకులు యేసును బాప్తీస్మమిచ్చు యోహాను అనుకున్నారు.

**బి) ఏలియా :** ప్రజలలో కొందరు ఏలియా అని, పాతనిబంధన ప్రవక్తగా అనుకున్నారు. ఆనాడు యెజెబెలును ఎదిరించటంకాని, బయలు ప్రవక్తలకు ఎదురువెళ్ళి దేవుని నామమును మహిమపరచిన వ్యక్తి. సామాన్యుల పక్షమున నిలిచి అనేక అద్భుతాలు, సూచక క్రియలు జరిగించిన దైవప్రతినిధి. అంతేకాక అగ్ని ప్రవక్తగా ఎంచబడినవాడు. బహుశా ఆ ఏలియాయే ఈవిధంగా వచ్చాడని ప్రజలు భావించారు. ఏలియాను గూర్చి లేఖనాలలో వ్రాయబడినది చదివారేకాని మెస్సియాను గూర్చి వ్రాయబడిన సంగతులను గూర్చి అవగాహన చేసుకోలేకపోయారు.

**సి) ప్రవక్త :** పాతనిబంధనా కాలంలో ప్రవక్తలే ప్రజలను నడిపించిన ఆధ్యాత్మిక నాయకులు. రాజులకు సలహాలు అందించడంలో కాని, ప్రజల తప్పులను ఖండించడంలో కాని, సమాజమును ప్రక్షాళన చేయడంలో అందెవేసిన చెయ్యి. ఎవ్వరికి భయపడకుండా, దైవ సందేశమును ప్రజలకు అందించేవారు. బహుశా యేసు యొక్క బోధలు విని, ఆయన కార్యాలను చూచినవారికి కేవలము ఒక ప్రవక్తగానే అగుపించాడు. వారికి అంతకు మించి అర్థంచేసుకొనే సామర్థ్యం లేదనేచెప్పాలి. అర్థం చేసుకొనకపోయినా పర్వాలేదు కాని అపార్థం చేసుకోవద్దనే మాట ఈ ప్రజల విషయంలో నిజమేననిపిస్తుంది.

ప్రజలు ఏమనుకుంటున్నారు? అని అడగటంతో ఆగిపోకుండా, మరి మీరు ఏమను కుంటున్నారు? అని యేసు తన శిష్యులను సూటిగా అడిగాడు. ప్రజాభిప్రాయాలను తెలపటంలో అందరూ నోరు తెరిచారు కాని వ్యక్తిగత అభిప్రాయ విషయంలో నోరు మూసుకున్నారు. అయితే పేతురు మాత్రం తన మనోభావనను యేసుముందు నిర్భయంగా

తెలియజేశాడు. యేసు కేవలము ఒక వ్యక్తిగానో, శక్తిగానో, గొప్పవానిగానో అనుకోవడంలో సరిపెట్టుకోలేదు, అంతకు మించి అర్థం చేసుకున్నాడు. ఆయనను సజీవునిగాను, దైవ కుమారునిగాను గుర్తించాడు. తన శిష్యులందరూ దైవకార్యాలను చూచారు కదా! మరి ఎందుకు మౌనంగా ఉండిపోయారు? ప్రియ పాఠకులారా, మనము కొన్ని సంగతులను గ్రహించవలసియున్నాయి. అవేమనిన, ప్రజలందరూ తాము పొందిన కార్యాలను ఆధారం చేసుకొని యేసును గూర్చిన అభిప్రాయాలు కల్గియున్నారు. శిష్యులు కార్యాలు చూచినా, వాక్యాలు విన్నా క్రీస్తును గూర్చిన తమ నిర్ణయము, సమర్పణ తెలియజేయటంలో ఒక అడుగు వెనక్కివేశారు. పేతురు యొక్క సమర్పణ ఏ కార్యము మీదనో (లేక) సందర్భము మీదనో ఆధారపడలేదు. కేవలము తన వ్యక్తిగత అభిప్రాయమునే తెలియజేశాడు. యిక్కడ మనము గమనించవలసిన విషయమేమనగా, మన సువార్తను, సాక్ష్యమును విన్నవారు యేసును అర్థంచేసుకోలేదని, వారు అంగీకరించలేదని కొన్నిమార్లు మనం బాధపడు తుంటాం. యిక్కడ మనకో ప్రశ్న ఉంది. అదేమంటే, యేసును గూర్చి విని, ఆయన కార్యాలను చూచిన మనము ఎంతగా ఆయనను గూర్చి అర్థం చేసుకున్నాము? ఎంత సమర్పణాయుతంగా మన అభిప్రాయాలను వెల్లడి చేస్తున్నాము? ఎవరైతే పేతురు వలే నిర్భయంగా దేవుని కోసం జీవిస్తారో వారికి మెండైన దీవెనలు తప్పక కలుగును. పేతురు యొక్క ఒప్పుకోలు, అతని స్థితిగతులు మార్చిన విషయం మనము గుర్తుచేసుకుంటూ భక్తిని చేయు కృప దేవుడు మనకు ప్రసాదించును గాక ! **- మరనాత.**


# సంగీత, సాహిత్య ప్రియులకు ప్రకటన

**డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి కలం నుండి వెలువడిన, నిరీక్షణ మెలోడీస్ సమర్పణలో వాల్యూం-3 ఆత్మాంజలి గీతమాలికను మరనాత విశ్వాస సమాజం, వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారి ఆశీస్సులతో డిశంబరు 25 న హైదరాబాదులోనూ, డిశంబరు 31 న విజయవాడలోనూ ఆవిష్కరించటమైనది. అందులో ఆత్మాంజలి పాటలతోపాటు, యింతకు ముందు మేము రూపొందించిన హృదయాంజలి, స్తోత్రాంజలి గీతమాలికలు మరియు మాన్యశ్రీ మోజెస్ చౌదరి గారి ప్రసంగాలు, డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి ప్రసంగాలు అందించటమైనది. ఈసారి ప్రజల సౌకర్యార్థం 16 జి.బి. పెన్‌డ్రైవ్‌లో పైన ప్రస్తావించిన పాటలు, ప్రసంగాలు పొందుపరచాము. కావలసినవారు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించవలసినదిగా మనవి. మీ పూర్తి అడ్రస్సు, ఫోన్ నెంబరుతో రూ.500/-లు పంపి కొరియర్ ద్వారా పొందగలరు.**

**-: BANK DETAILS :-**
**Maranatha Visvasa Samajam**
**SB. A/c.No.10932011013854**
**IFSC : ORBC0101093**
**Ameerpet, Hyderabad - 16.**




**డా॥ నిరీక్షణ కె. కంచర్ల**
మరనాత గ్రౌండ్స్, 12-7-133/81/2/1
రాఘవేంద్ర నగర్, కుకట్‌పల్లి
**హైదరాబాదు-500 072.**
సెల్ : 98497 46464

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

## ( 9 వ భాగము )

రెవ. అల్లూరి. విశ్వప్రసాద్, విజయవాడ

# ఐక్యతలో వరములు :

**పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమలో వందనములు శుభములు !**

రక్షించబడి దేవుని సేవిస్తున్న మనం వాక్యానుసారముగా జీవిస్తూ దేవుడు మనకనుగ్రహించిన ఐక్యతను కాపాడుకోవాలి. "సహోదరులు ఐక్యత కలిగిఉండుట ఎంత మేలు ఎంత మనోహరము" (కీర్తనలు 133: 1). ఇలాంటి ఐక్యత రావాలంటే దేవుని కృప మనకు కావాలి. 'కృపలో ఐక్యత' మరియు 'ఐక్యతకు పునాది' అను ఈ రెండు విషయాలనుగూర్చి గత నెలలో ధ్యానంచేసాం. ఈ నెలలో 'ఐక్యతలో ఉన్న వరములు లేక బహుమానాలు' అనే విషయమును గురించి ధ్యానంచేద్దాం (ఎఫెసీ పత్రిక 4 : 7-16).

ఐక్యతలో వరములున్నాయి, అవి దేవునియొద్దనుండి అనుగ్రహించబడుతాయి. ఐక్యతతో ఉంటే అభివృద్ధి జరుగుతుంది. ఎఫెసీ 4 : 12-16 లో ఐక్యతలో ఉన్న అభివృద్ధిని గురించి వ్రాయబడిఉంది. ఐక్యత మనం కలిగిఉన్నప్పుడు కుటుంబము వర్ధిల్లుతుంది, సమాజము వర్ధిల్లుతుంది. మనందరము వేరువేరు వ్యక్తిత్వాలు, భావాలు, ఆలోచనలు, పద్ధతులు మనం కలిగిఉన్నప్పటికి దేవునిసన్నిధిలో ఒక్కటిగా ఉండాలి. మనం పవిత్రంగా, ధైర్యంగా, దేవునిలో బలవంతులముగా ఉంటూ పరిశుద్ధాత్మ కలిగించు ఐక్యతను తీసుకురావాలి. అనైక్యత ఉన్నచోట ఐక్యతను కాపాడుటకు ప్రయత్నంచెయ్యాలి. **"అయితే మనలో ప్రతివానికిని క్రీస్తు అనుగ్రహించు వరముయొక్క పరిమాణము చొప్పన కృప ఇయ్యబడెను" (ఎఫెసి 4: 7).**

దేవుడు ప్రతివానికి కృపనిచ్చాడు. **"కృపావరములు నానావిధములుగా ఉన్నవి..... వీటినన్నిటిని ఆ ఆత్మ యొక్కడే తన చిత్తము చొప్పన ప్రతివానికి ప్రత్యేకముగా పంచియిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" (1 కొరింథీ 12 : 1-12).** ఈ వాక్యభాగము ప్రకారము ప్రతివిశ్వాసికి దేవుడు ఒక్క వరమైనా ఇస్తాడు. వరములేకుండా ఎవరూ లేరు. దేవుడు మీకు ఏ వరమిచ్చాడో పరిశీలించుకోండి. మీరు ఏ వరమును పొందుకోలేకపోతున్నామని బాధపడున్నట్లయితే దేవున్ని అడగండి. మీరు అడిగితే తప్పకుండా దేవుడు తన కృపచొప్పన విశ్వాసులకు అనేక విధములైన తలాంతులను ఇస్తాడు.

నేను పాటలుపాడుతానని, ఆతిధ్యమిస్తానని, ఇంత పరిచర్యచేసే కృప నాకుఉందని ఏమీ తెలియదు. కాని దేవునికి నన్ను నేను సమర్పించుకున్నప్పుడు నాకనుగ్రహించిన వరములను గుర్తించాను. స్వస్థతవరమును, ప్రార్థిస్తే ఆశీర్వదిస్తానని ఎన్నోవరములను గూర్చి దేవుడు అనేకసార్లు తెలియపరచాడు. నామీదున్న దేవుని అభిషేకమును ప్రతిదినము గుర్తిస్తున్నాను. దేవుడు మనకు ఇచ్చిన ఈ వరములన్నిటిని కాపాడుకోవాలి. ప్రతివ్యక్తి

తనయొక్క ఆధ్యాత్మిక సామర్థ్యమును గుర్తించి ఇతరులకు మేలుకలుగుటకు, దేవుని మహిమకొరకు వాడాలి. దేవుడు మనకిచ్చిన బహుమానాలు అందరికి పంచాలి అనేది దేవుని ప్రణాళిక. తోటివిశ్వాసి కలిగిఉన్న వరమునుబట్టి ఎవరైనా ఈర్ష్యపడుతుంటే అట్టివారు ఐక్యతలో లేనట్లే. విశ్వాసులకు అది తగదు. భక్తిలోఉన్న ఒకవ్యక్తి అనేక వరములతో కొనసాగుతుంటే ఆవ్యక్తిని మనం ప్రోత్సహించాలి. పౌలు ఎఫెసీ సంఘస్తులను ప్రోత్సహించుటకు ఈ సంగతులను వ్రాస్తున్నాడు. మనందరము వేరువేరు అభిరుచులు, ఆలోచనలు, భావాలు కలిగి ఉన్నవారము. భిన్నత్వములో ఏకత్వము అన్నారుకదా! భిన్న మనస్తత్వాలు కలిగిఉన్న మనం ఏకమైపోవాలి. ఆదిఅపోస్తలిక సంఘం ఐక్యత కలిగిఉన్నారు. వారు ఒకరినొకరు గౌరవించుకొని హెచ్చించుకున్నారు. సంఘము విస్తరించబడింది. మనం ఏకత్వము కలిగి, ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ గొప్పచేసుకున్నప్పుడు దేవుడు మన సంఘాలను కుటుంబాలను, రాష్ట్రాన్ని దేవుడు అద్భుతరీతిగా నడిపిస్తాడు.

**"అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు, చెరను చెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవులను అనుగ్రహించెనని చెప్పబడిఉన్నది. ఆరోహణమాయెననగా ఆయన భూమియొక్క క్రిందిభాగములకు దిగెననియు అర్థమిచ్చు చున్నదికదా, దిగినవాడు తానే సమస్తమును నింపునట్లు ఆకాశమండలము లన్నిటికంటె మరిపైకి ఆరోహణమైన వాడునై ఉన్నాడు" (ఎఫెసి 4:8, 9,10).** దీనిని గూర్చి దావీదు- ''నీవు ఆరోహణమైతివి పట్టబడినవారిని చెరపట్టుకొని పోతివి'' (కీర్తన 68 : 18) అని ప్రవచించెను. ఈ లేఖనభాగములనుబట్టి - క్రీస్తు మరణానికి ముందు అనగా పాతనిబంధనకాలంలో చనిపోయిన పరిశుద్ధుల ఆత్మలు ఎక్కడ ఉన్నారు అనేది చూస్తే- ఆ స్థలానికి హెబ్రూలో సియోల్ అని, గ్రీకులో హేడిస్, తెలుగులో పరదైసు అనే పదాలు వాడబడ్డాయి. ప్రభువు మరణించిన తరువాత ఈ పరదైసు ప్రాంతానికి వెళ్లినట్లుగ పైన లేఖనములో కనబడుతుంది. దాన్నిగూర్చి ధ్యానంచేద్దాం.

భూమి మధ్యభాగములో రెండు అరలు(గదులు) ఉన్నాయి. ఒకటి పరదైసు, రెండవది నరకము లేక పాతాళము. లూకాసువార్త 16 : 19-30 వచనములలో లాజరు, ధనవంతుడు ఇద్దరు చనిపోగా ధనవంతుడు నరకమునకు, లాజరు పరదైసుకు కొనిపోబడ్డారు. నరకమునకు, పరదైసుకు మధ్యన మహా అగాధము ఉంది. ధనవంతుడు నరకములో నుండి మాట్లాడుతూ - ఇంకా తన ఇంటివారు భూలోకములో ఉన్నారు, వారు ఈ వేదనకరమైన స్థలము (నరకము)లోనికి రాకుండా లాజరును పంపించి వారికి సువార్తను ప్రకటించాలి అని అబ్రహామును వేడుకొనినట్లుగా ఉంది. ప్రభువు సిలువ మరణ పునరుత్థానము ముందు వరకు పాత నిబంధన పరిశుద్ధుల ఆత్మలు పరదైసులో (చెరలో) ఉన్నాయి. ప్రభువు సిలువ మరణము ద్వారా మన పాపములనుండి విడిపించినట్లుగ పరదైసుకు వెళ్లి పరిశుద్ధుల ఆత్మలకు విడుదల కలిగించాలి. అప్పటివరకు వారికి విడుదల లేదు. యేసుప్రభువు నూతన నిబంధనలో ఉన్న మనలను విమోచించడానికి వచ్చాడు, పాత నిబంధన భక్తులకు ఇట్టి విడుదల లేదని అనుకోకూడదు. యేసుక్రీస్తు సర్వమానవుల విడుదల కొరకు వెల చెల్లించాడు.

''మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును. ఆత్మ దాని దయచేసిన

దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12 : 7). ప్రభువును అంగీకరించి పాపవిమోచన పొందినవారి ఆత్మలు పరలోకములోనికి, రక్షించబడని ఆత్మలు నరకములోనికి వెళతాయి. అంతేకాని చనిపోయిన ఆత్మలు దయ్యాలయి మనుష్యులను పట్టిపీడిస్తున్నాయి, నేను ఫలానా అని చెబుతారు. నిజానికి అవి చనిపోయిన ఆత్మలుకాదు. అవి మనమీదకి వచ్చిపట్టుకోవడం జరగదు. సైతాను అట్టి వారిపేర్లు, వివరము చెప్పి మనుష్యులను మోసంచేస్తాడు. అపవాది దాని అనుచరులు చేసే పని అది. సైతాను అబద్ధాలకు జనకుడు. అందరికి పునరుత్థానము ఉంది.**"దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును కీడు చేసిన వారు తీర్పు పునరుత్థానమునకును బయటకు వస్తారు"** (యోహాను 5 : 28). ఆ కాలము - **ప్రభువు రెండవ రాకడ.**

భూమిమీద నివసించిన నరులు ఏవిధముగా చనిపోయినను యేసుక్రీస్తు రెండవ రాకడలో సముద్రము, భూమి తమలోఉన్న మృతులను అప్పగించాలి. పునరుత్థానులైన వారు- **"తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును"** (2 కొరింథీ 5 : 10). దేవుని అంగీకరించిన ఆత్మలు పరదైసుకు వెళ్లిపోయినవి, అంగీకరించని ఆత్మలు పాతాళలోనికి వెళ్లిపోయినవి. జీవ పునరుత్థానము ఉంది, మరణ పునరుత్థానము ఉంది. అంటే, దేవుని అంగీకరించిన వారు తిరిగి లేవాలి, అంగీకరించక మరణించిన వారు కూడా తిరిగి లేవాలి. తరువాత తీర్పు జరుగుతుంది. ప్రతివాడు క్రీస్తు న్యాయపీఠము ఎదుట నిలువబడవలసి ఉంది. అది ఎటువంటి తీర్పు అంటే మనము శరీరముతో జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైన, చెడ్డవైన సరె తీర్పు జరుగుతుంది. తీర్పుతరువాత ప్రభువైనయేసును విశ్వసించి రక్షించబడినవారము దేవునిమహిమలో నివాసంచేయుటకు పరలోకానికి, అపవిత్రుల ఆత్మలు నరకములోనికి వెళ్లిపోతారు. **"అప్పుడాయన ఎడమవైపున ఉండువారిని చూచి శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి." (మత్తయి 25 : 41). "వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు" (మత్తయి 25 : 41).**

ప్రియ సోదర సోదరిలారా, ఇక్కడ జీవితం కొద్దికాలమే, తరువాత మీ గమ్యం ఏమిటనేది మీరు ఇక్కడే నిర్ణయం చేసుకోవాలి. ఈరోజు నీ జీవితాన్ని ప్రభువుకు అర్పించి ఆయన రక్షణను అంగీకరిస్తే నేను మరణించినా నరకానికి వెళ్లను. పునరుత్థానము, తీర్పుతరువాత పరలోకరాజ్యములో ఆయనతో నిత్యము ఉంటాననే తీర్మానము చేసుకోండి. నేను ఆ తీర్మానము చేసుకొన్నాను కాబట్టి దేవునియందలి భయభక్తులతో ధైర్యంగా జీవించగలుగుతున్నాను. ఆ నిత్యరాజ్యములో మనమందరము వారసులము కావాలని దేవుడెంతగానో ఆశిస్తున్నాడు.

**"మనమందరము విశ్వాస విషయములోను దేవుని కుమారుని గూర్చిన జ్ఞాన విషయము లోను ఏకత్వముపొంది, సంపూర్ణ పురుషులమగు వరకు, అనగా క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు**

**సమానమైన సంపూర్ణత కలవారమగువరకు, ఆయన ఈలాగు నియమించెను"(ఎఫెసి 4:11).** ఐక్యతలో ఉన్న వరములుగురించి మరికొన్ని ప్రాముఖ్యమైన లేఖన భాగములను చూద్దాం. 1 కొరింథి12 : 4-11, 27-31 లో ప్రత్యక్షత వరాలు, రోమాపత్రిక 12 : 3-8 లో ప్రోత్సాహపరచే వరాలు, ఎఫెసీపత్రిక 4 : 13 లో పరిచర్య వరాలున్నాయి. **"ఆయన కొందరిని అపోస్తలులుగాను, కొందరిని ప్రవక్తలుగాను, కొందరిని సువార్తికులుగాను, కొందరిని కాపరులుగాను, కొందరిని ఉపదేశకులుగాను నియమించెను" (ఎఫెసీ 4 : 13).** వీటిలో మీరు ఏమి కలిగిఉన్నారో చూచుకోండి.

ఎఫెసీ 4 : 13 లో ఉన్న పరిచర్యవరాలను గూర్చి సులభముగా గుర్తుంచుకొనుటకు చేతివ్రేళ్లలో ఐదింటిని చూపించి - మొదటిగా బొటనవ్రేలు అపోస్తలులు, చూపుడువ్రేలు ప్రవక్తలు, మధ్యవ్రేలు సువార్తికులు, నాల్గవవ్రేలు సేవకులు, ఐదవవ్రేలు ఉపదేశకులు అని నేను బైబిల్‌స్కూల్‌లో చదువుకొనేటప్పుడు వీటినిగురించి దైవజనులు ఉపదేశిస్తుండగా నేను వాటిల్లో ఒక్కవరమైనను కలిగియుండలేదు. మాటలుకూడ సరిగారాని నత్తివాణ్ణి, పిలుపును గూర్చిన నిర్థారణ లేదు. రెండు సంవత్సరాలు ఉపవాసములతోను ప్రార్థనలతోను దైవజనులు మోజెస్‌చౌదరిగారి శిష్యరికములో ఎన్నో ఆత్మీయ సంగతులు నేర్చుకొన్నాను. వారిలో ఈ ఐదు పరిచర్య వరాలను నేను చూశాను. నేనువీటన్నిటిని కలిగిఉండాలని అనుకోలేదు గాని ఒక చిన్న గ్రామములో సామాన్యమైన సంఘకాపరిగా ఉండి కొన్ని కుటుంబాలనైన దేవునిసన్నిధికి నడిపిస్తూ, దైవజనుని వెనుకఉండి వారికి చేయూతనిస్తే చాలు అని ఆత్మీయ జీవితాన్ని ఆరంభించాను. కాని దేవుని సన్నిధిలో మనము విధేయతతో ఉండి ప్రార్థిస్తే అనేక పరిచర్యలలో నన్ను వాడుకొంటున్న దేవుడు మిమ్ములనుకూడ వాడుకొంటాడని మనవిచేస్తున్నాను.

**"అందువలన మనమికమీదట పసిపిల్లలమైయుండి, మనుష్యుల మాయోపాయముల చేత వంచనతోను, తప్పమార్గమునకు లాగు కుయుక్తితోను, గాలికి కొట్టుకొనిపోవునట్లు, కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొనిపోవుచు అలలచేత ఎగురగొట్టబడిన వారమైనట్లుండక, ప్రేమ గలిగి సత్యము చెప్పచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము".**

**"ఆయన శిరస్సయియున్నాడు, ఆయననుండి సర్వశరీరము చక్కగా అమర్చబడి, తనలోనున్న ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పన పనిచేయుచుండగా ప్రతి కీలువలన కలిగిన బలముచేత అతుకబడి, ప్రేమయందు తనకు క్షేమాభివృద్ధి కలుగునట్లు శరీరమునకు అభివృద్ధి కలుగజేసికొనుచున్నది" (ఎఫెసి 4 : 15,16).**

ఈ దినాలలో ప్రపంచానికి కావలసిన ఐక్యత సందేశమిదే. విశ్వాసులైన ప్రతిఒక్కరు ఆత్మసంబంధమైన ఐక్యతలో వర్ధిలాలని లేఖనాలలో చాలా స్పష్టంగా చెప్పబడిఉంది. ప్రతి నాయకుడు తన క్రిందనున్నవారికి, ప్రతి తండ్రి,తల్లి తన పిల్లలకు చెప్పవలసిన సంగతులివే. అదేవిధంగా పౌలు తన ఆత్మీయకుమారుడైన తిమోతికి- దేవుని వాక్యములోను, విశ్వాసములో నిలుకడగా ఉండమని, అప్పగించినపనిలో నమ్మకముగా ఉండాలని, దుర్బోధలను నమ్మి అటుఇటు వెళ్లిపోవద్దు, నీ విశ్వాసమునుంచి తొలగిపోవద్దు అని

స్పష్టంగా చెబుతున్నాడు **(2 తిమోతి 3 : 13-17).**

**"ప్రతి అవయవము తన తన పరిమాణముచొప్పున పనిచేయుచుండగా ప్రతి కీలువలన కలిగిన బలముచేత అతుకబడి, ప్రేమయందు తనకు క్షేమాభివృద్ధి కలుగునట్లు శరీరమునకు అభివృద్ధి కలుగజేసికొనుచున్నది" (ఎఫెసీ 4 : 16).** శిరస్సు - సర్వశరీరమునకు చక్కగా అమర్చబడి ప్రతి అవయవము ఏవిధంగా పనిచేస్తుందో, ప్రతికీలువలన కలుగు బలముచేత అతుకబడి సహకరించు కుంటుందో అలా ఒకరినొకరము ప్రేమతో సహించుకుందాం(ఎఫెసి 4 : 2), ప్రేమ కలిగి సత్యము చెబుదాం (4 : 15), ప్రేమయందు క్షేమాభివృద్ధి కలుగచేద్దాం (4 : 16). **"ప్రేమ కలిగి సత్యము చెప్పచూ క్రీస్తువలె మనము అన్ని విషయములలోను ఎదుగుదము" (ఎఫెసీ 4 : 15).** ఎవరిలోనైన పొరపాట్లు ఉంటే అవసరమైతే వారు గాయపరచ బడినను, వారిని సరిచేసి ప్రేమించి క్షమించి దేవునిలో బలపరచండి. **"మేలును కోరి స్నేహితుడు గాయములు చేయును. పగవాడు లెక్కలేని ముద్దులుపెట్టును"(సామెతలు 27: 6).**

సంఘము అభివృద్ధిచెందాలంటే, సంఘాన్ని ఎప్పుడూ బలవర్ధకమైన వాక్యాహారముతో పోషించాలి. పాలిచ్చే పశువులకు ఎప్పుడూ మంచి మేతపెడితేనే ఎక్కువ పాలిస్తాయి. మనం కూడ బలమైన ఆహారము తీసుకుంటేనే బలంగా ఉంటాం. కాబట్టి దేవుని వాక్యములోఉన్న సంగతులను మరింత స్పష్టంగా గ్రహించి ఆధ్యాత్మిక శక్తిని పొందుటకు దేవుని అడగాలి.

ఐక్యత కొరకైన వరాలను ప్రతిరోజూ పొందుకొనండి. ఎవరైన, ఎక్కడైన అసమాధానముతో ఉంటే వారిని ఐక్యపరచండి. ప్రేమతో సహించండి, సత్యము పలకండి, క్షేమాభివృద్ధిని, ప్రోత్సాహాన్ని పొందుకొంటూ ముందుకు సాగిపోదాం. **- మరనాత.**

# గమనించండి - సహకరించండి

మీరు "మరనాత మెసేంజర్" పట్ల చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞులము. ముద్రణావ్యయము పెరిగిన కారణముగా జనవరి 2018 నుండి పత్రిక సాలుసరి చందా రూ.150/-కు పెంచడమైనది. గాన పాఠకులు గమనించి సహకరించగలరు. మీరు సాలుసరి చందా చెల్లించారా? లేనియెడల త్వరగా చెల్లించి పత్రికా పరిచర్యలో మీవంతు సహకారమును అందించండి, ప్రార్థించండి. మీ చందా పంపునప్పుడు యం.ఓ ఫారంలో సమాచారము కొరకు ఇవ్వబడిన స్థలములో మీ పేరు, పూర్తి అడ్రస్సు (ఇంటి నెంబరు, వీధిపేరు తప్పక రాయాలి మరియు మీ అడ్రస్సు మారినచో పాత, క్రొత్త అడ్రస్సులు పిన్ కోడ్ నంబరుతో సహా) వ్రాసి మీకు రిసిప్టులు, పత్రికలు పంపడంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి మాతో సహకరించ వలసినదిగా పాఠకులకు మనవి. **- ఎడిటర్స్.**

# అమ్మతనానికే... అమ్మ

డా॥ కొటారి మనష్షే, గుంటూరు

అమ్మ అంటే ప్రేమ, ప్రేమే. సృష్టికి జీవం పోసింది అమ్మ. అమ్మ గర్భగుడి మానవజాతి చిరునామా. అమ్మ లక్షణం అమ్మతనం. అమ్మతనాన్ని అందులోని గొప్పతనాన్ని, అమ్మ త్యాగం, అమ్మపడిన కష్టం, అమ్మ వలన పొందిన ప్రేమ, అమ్మ బాధ్యతలు, అమ్మ నీకు చేసినవన్నీ, చేస్తున్నవన్నీ మనస్సుపెట్టి ఆలోచించు.

ఏ శరీరమైన మహా అయితే 45 డెల్ యూనిట్ల నొప్పిని భరించగలదు. కానీ అమ్మ మాత్రం 57 డెల్ యూనిట్ల నొప్పిని తట్టుకుంది. అంటే ఒంట్లోని ఇరవై ఎముకలు ఒకేసారి విరిగిపోతున్నంత బాధ. నీకు జన్మనివ్వడానికి అమ్మ నరకయాతన అనుభవించింది. అమ్మ తన రక్తాన్ని చమురుగాపోసి, వెలిగించిన ప్రాణదీపం నువ్వు, తల్లిపాలు త్రాగి నువ్వు బలంగా ఎదిగావు. అమ్మ ఎంత బలహీనమైపోయిందో, అమ్మ శరీరంలోని బలాన్ని నువ్వు తల్లిపాల ద్వారా పొందావు కదా. ఒక సర్వే ప్రకారం నీకు 2 సంవత్సరాలు వచ్చేలోపు సుమారు 7300 సార్లు నీకు డైపర్లు మార్చింది అమ్మ, ఎంత సహనమో! 2 సంవత్సరాలు వచ్చేలోపు 400 గంటలు నీ శరీరం నుండి విడుదలైన మురికిని శుభ్రం చెయ్యడానికి సరిపోయింది. నువ్వు పెరిగేటప్పుడు వచ్చిన జ్వరాలు, దగ్గు, జలుబు, వాంతుల లిస్ట్ చాలా పెద్దది. నీకు అనారోగ్యం తగ్గేవరకు అమ్మ పడుకోదు, ఎన్ని నిద్రలేని రాత్రులో!! ఆరోగ్యం ఎంత దెబ్బతిందో! ఎంత త్యాగం!! నీకు ఏ కష్టం రాకుండా బాధ కలుగకుండా అమ్మ నిన్ను పెంచింది. మరి అమ్మకు అనారోగ్యం వస్తే అమ్మ నిన్ను చూసుకున్నట్లు అమ్మని ఎవరు పట్టించుకొని ఉంటారు? అమ్మకి నువ్వే సర్వస్వం. తన బాధలను దిగమింగి రాజీలేకుండా నిన్ను ప్రేమించింది, పెంచింది. నీ మొదటి గురువు అమ్మ. నీకు నడక నేర్పి, మాటలు నేర్పి, నీకు ప్రపంచాన్ని పరిచయం చేసింది అమ్మే! అమ్మ ఒడి ఒక బడి, ఒక గుడి. నీ మొదటి ఫ్రెండ్ అమ్మే! నిన్ను నవ్వించి, కవ్వించి, ఆడించి, లాలించి పెంచిన అమ్మకి సాటి ఎవరు? రవ్వల నెక్లెస్‌కన్నా, ముత్యాల హారంకన్నా, బంగారు గొలుసుకన్నా నీ చిట్టిచిట్టి చేతులు అమ్మ మెడకు చుట్టుకుంటున్నప్పుడు అమ్మకి ఎంత ఆనందమో!!

అమ్మగా, భార్యగా, కోడలిగా ఇంటిపని, వంటపని అమ్మకి ఎన్ని పదవులో! అమ్మకు జీతం లెక్కగట్టాల్సివస్తే అంకెలు సరిపోవు. ఎటువంటి ఛార్జీ లేకుండా ఇంటి బాధ్యతలను మోసే ఇంఛార్జ్ అమ్మ. నువ్వు తప్పటడుగులు వేసిన దగ్గర నుండి నేటివరకు వేసిన ప్రతి అడుగులో అమ్మ పాత్ర ఎంతో ఉంది. నువ్వు పుట్టిన దగ్గర నుండి అమ్మ నీకు చేసిన సేవలకు ఎంత ఫీజు కట్టాలి? వెలకట్టలేము. అమ్మ సేవలన్నీ ఉచితమే! ప్రేమ నిండిన సేవలు!!

సృష్టిలో జీవి మనుగడకూ మెటర్నల్ ఆక్సిటోసిన్‌కూ (అనగా ఆడజీవుల్లో మాతృత్వపు

లక్షణాలను నియంత్రించే హార్మోను పేరు ఆక్సిటోసిన్) చాలా దగ్గరి సంబంధం ఉంది. అంతరించిపోయిన, అంతరించిపోతున్న జీవుల శరీర వ్యవస్థను పరిశీలిస్తే..ఏ ఆడజీవిలోను మాతృత్వపు ఆక్సిటోసిన్ ఆనవాళ్ళు సరిగా కనిపించవు. అంటే మాతృత్వ బంధమూ తగ్గినట్టే. అందుకే ఆడ ప్రాణులు పసిబిడ్డల విషయంలో పెద్దగా శ్రద్ధపెట్టవు. గుడ్డు మానాన గుడ్డునో, బిడ్డ మానాన బిడ్డనో వదిలేసి వెళ్ళిపోతాయి. లేదంటే మగపక్షికి అంటగట్టేసి మరో తోడు వెతుక్కుంటాయి. "అమ్మ సంరక్షణ లేని ఏజాతికైనా మనుగడ దినదినగండమే". సమస్యలను, సవాళ్లను, ప్రకృతి భీభత్సాలను తట్టుకొని మానవజాతి నిలబడిందంటే వందలకోట్ల సంతతితో వర్ధిల్లుతోందంటే కారణం మనిషి మేధస్సు కాదు... అమ్మతనం, అమ్మ ప్రేమ. ఈ జగతికి, మానవజాతి ప్రగతికి ముఖ్య కారణమైన అమ్మలందరికి మనస్ఫూర్తిగా నమస్కరిస్తున్నాను.

ఒక దేశాధ్యక్షుడు ఆ మార్గంగుండా వెళ్తుంటే ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిపేశారు. ఓ చిన్నపిల్లవాడు అదంతా పట్టించుకోకుండా రోడ్డు మీదికొచ్చాడు. వాడి వెనకాలే తల్లి పరుగెత్తుకొని వచ్చింది. దూసుకెళ్తున్న అధ్యక్షుడి వాహనానికి బ్రేకులు పడ్డాయి. కారు అద్దాలు దించి బయటికి చూశాడు.

"క్షమించండి సర్" చేతులు జోడించింది తల్లి. "నాకంటే కూడా అతిముఖ్యమైన బాధ్యత నీది, క్షమాపణలెందుకు?" అన్నాడు అధ్యక్షుడు.

తల్లీ, బిడ్డ రోడ్డు దాటేదాకా ఆగి బయల్దేరాడు ఆయన. ఆ దేశాధ్యక్షుడు కూడా అమ్మ కొడుకే కదా! అదీ అమ్మకివ్వాల్సిన గౌరవం!

ఇంత చదివినాక అమ్మ మీద కృతజ్ఞత ఉప్పొంగుతుంది కదా! అమ్మ ఋణం తీర్చుకోవాలనిపిస్తుంది కదా! ఇప్పుడైనా మొదలుపెట్టు, అమ్మ ఎంతో చేసింది. నువ్వు కొంతైనా చెయ్యాలి. అమ్మని ప్రేమించు, అమ్మని పట్టించుకో. అమ్మ ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకో. అమ్మ నీకు ఎన్ని వేల ముద్దులు పెట్టి ఉంటుంది. ముద్దుగా చూసుకో అమ్మని. అమ్మ గోరు ముద్దలు తిన్నావు కదా, అమ్మకి ఆరోగ్యం బాగోపోతే అన్నం తినిపించు. అమ్మకి చదువు లేదేమో, అమ్మకి లోకవార్తలు చెప్పు. నీకు తెలిసిన జ్ఞానం అమ్మతో పంచుకో. చిన్నప్పుడు నువ్వు ఏడ్చిన ప్రతిసారీ నీ కన్నీళ్లు తుడిచింది కదా, నువ్వు ఇప్పుడు అమ్మకి తోడుగా ఉండాలి, కన్నీళ్లు పెడితే తుడవాలి. పొరపాటున కూడా అమ్మ కన్నీళ్లకి నువ్వు కారణం అవ్వకూడదు.

అమ్మని పట్టించుకోకుండా 'మదర్స్ డే' రోజు బహుమతులు ఇవ్వడం ట్రెండ్ అయిపోయింది. అమ్మకి వాచ్ బహుమతి ఇవ్వడం కాదు, జీవితాంతం 'వాచ్' చేయాలి, అంటే బాగా చూసుకోవాలి అని. అమ్మను చూసుకోవడానికి పెద్దయ్యాక వంతులు వేసుకుంటున్నారు. అమ్మ మన చిన్నప్పుడు వంతులు వేసుకొని మనలను పెంచలేదు. నీ కలలను సాకారం చేయడానికి అమ్మ సర్వం త్యాగం చేసింది. ఎన్నో కలలు ఆశలతో నిన్ను పెంచింది. నీ కలలు సాకారం అయ్యాక అమ్మ కలలను కాలరాస్తే, అమ్మను పట్టించుకోకుండా, వృద్ధాశ్రమంలో వదిలివేయడం ఎంత దారుణం, సిగ్గుచేటు. అప్పుడప్పుడు

రింగ్‌చేసి ఫోన్‌లో మాట్లాడటం కాదు. అమ్మకి నువ్వే డార్లింగ్, అమ్మ నీతో ఉండాలి. నీ సమయం అమ్మకి కావాలి. నీకు జీవితాన్ని ఇచ్చిన అమ్మను జీవితాంతం జాగ్రత్తగా ప్రేమతో చూసుకోవాలని నిర్ణయించుకో!

ప్రతి స్త్రీలో అమ్మ ఉందని గుర్తిస్తే అమ్మతనం విలువ గ్రహిస్తే అత్యాచారాలు జరగవు. సృష్టి ఉన్నంతకాలం ఇంటికో రూపంలో అమ్మ జన్మిస్తూనే ఉంటుంది, జన్మనిస్తూనే ఉంటుంది.

**అమ్మ కాబట్టి అమ్మతనం చూపెడుతుంది. అమ్మ కాకపోయినా అమ్మతనం చూపిస్తే?** తన కడుపున పుట్టకపోయినా దిక్కులేని అనాధ బాలబాలికలకు దిక్కు అయితే ఆ అమ్మని ఏమనాలి? సమాజం వెలివేసిన కుష్ఠురోగుల గాయాలను కట్టిన అమ్మను ఏమనాలి? నిరాశ్రయులకు, వరదబాధితులకు అంటువ్యాధులు సోకినవారికి శరణాలయాలు స్థాపించి, వారిని చేరదీసిన అమ్మను ఏమనాలి? వృద్ధులకు వృద్ధాశ్రమాలు స్థాపించి వారు మరణించే వరకు వారికి చికిత్స అందించిన ప్రేమగల అమ్మను ఏమనాలి? హెచ్.ఐ.వి. వ్యాధిగ్రస్తులకు చికిత్సశాలలను ఏర్పాటు చేసిన కరుణగల అమ్మను ఏమనాలి? **అమ్మతనంకన్నా గొప్పతనం ఏముంది కానీ 'మధర్ థెరిస్సా' అమ్మతనానికే... అమ్మ, విశ్వమానవాళికి మాదిరియైన అమ్మ. ప్రార్థించే పెదవులకన్నా సహాయంచేసే చేతులు గొప్పవిఅని ప్రపంచాన్ని మేల్కొలిపిన గొప్ప సంఘ సంస్కర్త. సమాజానికి సేవా దృక్పథం నేర్పించిన మహనీయురాలు.** కేవలం 13 మంది సభ్యులతో మొదలై నేటికి 4500 మంది సోదరీమణులతో 133 దేశాలలో 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' ద్వారా వేలమంది అనాధలకు, వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు, నిరాశ్రయులకు, ఆశ్రయం కల్పిస్తున్నారు. **ఇంత గొప్ప సమాజసేవ జరగడానికి కారణం మదర్ థెరిస్సా హృదయంలోని నిస్వార్థమైన ప్రేమే కారణం.** ఒకసారి ఆమె మాట్లాడుతూ - **"వంశపరంగా నేను అల్బేనియన్‌ని, పౌరసత్వంద్వారా భారతీయురాలిని! నా మనస్సుకి సంబంధించి నేను పూర్తిగా యేసు మనస్సుకు చెందినదానిని"** అన్నారు. **మదర్ థెరిస్సా మనస్సులో ఉన్న నిస్వార్థమైన ప్రేమకు జన్మస్థలం యేసు సిలువ. ఈ అసాధారణ ప్రేమ సాధారణమైన మనిషిచేత ఇన్ని అసాధారణమైన సేవలు చేయించగలిగింది. పరిమితమైన మనిషిలోనే ఇంత ప్రేమ దాగిఉంటే మరి మదర్ థెరిస్సాను సృష్టించిన సృష్టికర్త ప్రేమ ఎంతో మధురమైనది, అపరిమితమైనది, అనంతమైనది, అంతులేనిది, కొలతలేనిది. "నేను నిన్ను ప్రేమించినట్లు నీ పొరుగువాడని నువ్వు ప్రేమించు" అనే యేసు బోధ మదర్ థెరిస్సాకు స్ఫూర్తి.** కుష్ఠురోగులకు, దిక్కులేనివారికి, నిరాశ్రయులకు ఎలా సేవ చెయ్యగలుగు తున్నారని మదర్ థెరిస్సాని అడిగితే- **"యేసు ప్రభువు సర్వమానవాళి కొరకు తన మహిమను విడచి మానవులందరి పాపముల కొరకు సిలువలో ప్రాణత్యాగం చేసి, వెల చెల్లించారు. ఆ యేసుక్రీస్తు అందరికీ ప్రభువు కనుక ఆయన చేసిన ప్రాణత్యాగం, భరించిన శ్రమలు వీరి విలువను తెలియజేశాయి. అల్పులు, కుష్ఠురోగులైన వారు కూడా నా దేవుని దృష్టిలో విలువైనవారు, వారి కోసం కూడా ఆయన మరణించి తిరిగి లేచారు కాబట్టి వారి జీవితాలు కూడా అత్యంత విలువైనవిగా ఎంచి వారికి ప్రేమతో సేవ చెయ్యగలుగుతున్నాను"** అని చెప్పారు.

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Gollapudi, VIJAYAWADA - 521 225
Printed on 08-10-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

మరనాత విశ్వాస సమాజము సమర్పించు

# మరనాత దర్శనం

అధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

దైవదాసులు శ్రీ గుళ్లపల్లి మోజెస్ చౌదరి,

దైవదాసులు శ్రీమతి & శ్రీ అల్లూరి విశ్వప్రసాద్

దైవదాసులు డా॥ నిరీక్షణ కంచర్ల గార్లు

అధ్యాత్మిక వర్తమానములు అందించెదరు.

## కల్వరి ఛానల్‌లో

Calvary tv

బుధవారం రాత్రి 8 - 8 : 30 గంటల వరకు

శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు

శనివారం రాత్రి 7 - 7 : 30 గంటల వరకు

## ఆరాధన ఛానల్‌లో

ఆరాధన ARADHANA

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

## శుభవార్త ఛానల్‌లో

SUBHAVAARTHA TELEVISION

సోమవారం మధ్యాహ్నం 1 :30 - 2 వరకు

శుక్రవారం రాత్రి 9 :30 - 10 గంటల వరకు




-: ప్రతుల కొరకు : -

విజయవాడ - 89777 61512: 0866- 2480047

హైదరాబాద్ - 99896 98072

విశాఖపట్నం - 94405 74118




R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 08-06-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

శిక్షణ పొందండి ! శిష్యులనుగా చేయండి!!

# మరనాత వేద పాఠశాల – విశాఖ

## మరనాత విశ్వాస సమాజపు పరిచర్య

"దైవసేవ - దేశసేవా తత్పరులైన యువతకు అద్భుత అవకాశం"


దైవజనులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు

జన్మ, కర్మ పాప బంధితులు, బానిసలైన మానవాళికి యేసుక్రీస్తు యొక్క అవతారంలో విముక్తి లభ్యమైనది. ఈ గొప్ప సువార్తను ప్రజలు విశ్వసించి, పాప విమోచన, ఆత్మ రక్షణ పొందాలంటే ఈ శుభవార్తను తెలుగువారికి చాటించే వారుండాలి. అందుకు సుశిక్షితులైన యువత కావాలి! లేవాలి!! అందుచేతనే స్వయాన ప్రభువు వారే "కోత విస్తారమేగాని పని వారు కొద్దిగా ఉన్నారు" అని వాపోయారు.

ఇటువంటి దైవసేవ చేయాలనే ఆశ, దేవుడు పిలిచాడనే నిశ్చయత మరియు ఆయన పనిపట్ల సమర్పణ గలవారికి వాక్య సేవా తర్ఫీదు నివ్వాలనే దర్శనంతో 'మరనాత వేద పాఠశాల' 33 సంవత్సరాల క్రితం దైవదాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిచే స్థాపించబడింది.

### నిర్వహించే కోర్సులు :



1) Diploma in Biblical Studies (D.B.S) రెండు సం॥లు (4 సెమిస్టర్లు)
2) Bachelor of Theology (B.Th) మూడు సం॥లు (6 సెమిస్టర్లు)
3) 40 రోజుల వేసవి వేదపాఠశాల (ఏప్రిల్ 9 - మే నెల 19 వరకు)

అర్హతలు : రక్షణానుభవము, సేవార్థమైన దేవుని పిలుపు, సమర్పణ, 18 సం॥లు పైన వయస్సు గలవారు.

**స్త్రీలకు ప్రత్యేక వసతి**

వాక్యతర్ఫీదు పొందదాసక్తి గలవారు అప్లికేషన్ నిమిత్తము రూ.100/-లు పంపి, పొంది, పూర్తి చేసి వెంటనే పంపించవలెను. భోజనము, వసతి : ఉచితం; బోధనా భాష : తెలుగు.




**ప్రత్యేకతలు :**

- ఉన్నత విద్యార్హతలు
- వాక్య పరిజ్ఞానము
- స్వదేశీ, విదేశీ సేవానుభవం కల్గిన అధ్యాపక బృందం మరియు
- వ్యక్తిగత శ్రద్ధ
- క్రమశిక్షణ
- సిద్ధాంత, ఆచరణాత్మక సద్విద్యల సమన్వయము.

**వివరములకు :**

రెవ. శిరిపురపు సైలస్ ప్రకాష్
M.Com., M.Div. (USA)
డైరెక్టర్, మరనాత వేద పాఠశాల
50-43-9, టి అండ్ టి కోలనీ, సీతమ్మధార,
విశాఖపట్నం-530013.
✆ : 98481 24651,
9949590555, 8897884111
maranathavisakha@gmail.com




మరనాత
బిబ్లికల్ సెమినరీ
విజయవాడ
Accredited by
Asia Theological Association &
Christ For The Nations Association of Bible Schools
కోర్సులు కాలపరిమితి బోధనాభాష
B.Th 3 సంవత్సరాలు ఇంగ్లీష్ & తెలుగు
Dip.Th 2 సంవత్సరాలు తెలుగు
C.Th ఒక సంవత్సరం తెలుగు
జూన్ 24 నుండి క్లాసులు ప్రారంభం
అభిషిక్తులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన.
శ్రీ అల్లూరి విశ్వప్రసాద్
2019
ఏప్రిల్ 8 - మే 17 వరకు
విశిష్టతలు
Spoken English Courses
ATA Curriculum
మరనాత విశ్వాస సమాజము
గాయత్రీనగర్, విజయవాడ.
E-mail : mvpvja8@gmail.com
9642793777
9441308156, 7799212199